# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 49, EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 09 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 49, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 09 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## పేపర్ లీకేజీ పై సిట్ చార్జ్ షీటు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. నిందితులపై అభియోగపత్రంలో 37 మంది పేర్లు చేర్చనున్నట్లు తెలుస్తోంది. న్యాయ సలహా తీసుకొని వచ్చే వారంలో అభియోగపత్రం దాఖలు చేసే యోచనలో సిట్ అధికారులు ఉన్నట్లు సమాచారం. పేపల్ లీకేజీ కేసులో సిట్ అధికారులు ఇప్పటి వరకు 50 మందిని అరెస్ట్ చేశారు. ఇందులో 15 మంది నిందితులు బెయిల్ పై బయటకి వచ్చారు. ప్రధాన నిందితుడు ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డితో పాటు మిగతా నిందితులు జైల్లోనే ఉన్నారు.

మిగతా 3లో...

### రెజ్లర్ల 5 డిమాండ్లు..

## 15 వరకూ వేచిచూడమన్న కేంద్రం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషన్ సింగ్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ రెజ్లర్లు చేపట్టిన ఆందోళన మరో కీలక మలుపు తిరిగింది. కేంద్ర క్రీడల మంత్రి అను రాగ్ ఠాకూర్ ఆహ్వానం మేరకు రెజర్లు బజ్రంగ్ పూనియా సాక్షి మాలిక్ సుమారు ఆరు గంటల సేపు ఆయన నివాసంలో సమావేశమయ్యారు. 5 డిమాండ్లతో కూడిన లిఖిత పూర్వక ప్రతిపాదనను మంత్రికి రెజ్లర్లు సమర్పించినట్టు తెలుస్తోంది. కాగా, ఈనెల 15వ తేదీతో దర్యాప్తు పూర్తవుతుందని, అంతవరకూ వేచిచూడాలని కేంద్రం రెజ్లర్లను కోరింది.

**బజ్రంగ్ పూనియా ఏం చెప్పారంటే..?**


కేంద్ర మంత్రితో సమావేశానంతరం రెజ్లర్ బజ్రంగ్ పూనియా మాట్లాడుతూ, పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించామని, పోలీసు విచారణ జూన్ 15తో పూర్తవుతుందని, అంతవరకూ ఎలాంటి

మిగతా 2లో...

## కమలంలో... కోవర్టుల కల్లోలం

- తెలంగాణా బీజేపీలో తారాస్థాయికి అంతర్గత విభేదాలు
- కర్ణాటక ఎన్నికల తర్వాత నాయకుల్లో ఒక్కసారిగా మార్పు
- కేసీఆర్ మనుషులూ ఉన్నారని అనుమానాలు
- కోవర్టుల పూర్తి ఆధారాలున్నాయంటున్న నందీశ్వర్‌గౌడ్





హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. బహిరంగ తిట్టుకోవడానికి కూతవేటు దూరంలోనే నేతలు ఉంటున్నారు. ఇప్పటికే ఇన్‌డైరెక్ట్‌గా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత అసలే పార్టీ సమస్యల్లో ఉంటే ఇప్పుడు నేతల మధ్య విభేదాలు పుండు మీద కారం చల్లినట్టు ఉంటోంది. కర్ణాటక ఎన్నికల తర్వాత ఒక్కసారిగా పార్టీ నేతల ప్రవర్తనలో మార్పు వచ్చింది. ముఖ్యంగా వేరే పార్టీల నుంచి చేరిన వారు పక్కచూపులు చూస్తున్నారనే టాక్ గట్టిగానే వినిపిస్తోంది. మరికొందరు ఆపార్టీలో చేరుదామా అన్ని కొన్ని రోజులుగా ఆలోచించిన వాళ్లు ఇప్పుడు బీజేపీ వైపు చూడటానికే ఇష్టం పడటం లేదు. ఆ పార్టీలో ఉన్న వారిని ఎలా బయటకు లాగుదామా అని ఆలోచిస్తున్నారట. ఉన్న వాళ్లు బయటకు రావడానికైనా... వేరే పార్టీ వాళ్లు బీజేపీలోకి వెళ్లకపోవడానికైనా చెప్పే ఒకే ఒక కారణం కోవర్ట్. అదే కేసీఆర్ మనుషులు బీజేపీలో ఉన్నారని అక్కడ జరిగే పరిణామాలు, చేరికలు,

మిగతా 2లో...

## ఆచూకి దొరకని 83 మంది వివరాలు

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



ఒడిశాలోని మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో 288 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటివరకు మృతుల్లో 83 మందిని ఇంకా గుర్తించలేదు. అందుకోసం రైల్వేశాఖ అధు నాతన సాంకేతికత వైపు ఆధారపడు తోంది. వేలిముద్రలు, సిమ్ కార్డు సహా ఏదైన చిన్న ఆధారం దొరికినా మృత దేహాలను అప్ప గించాలని ప్రయత్నాలు చేస్తోంది. మొదటగా మృతుల వేలి ముద్రలు సేకరించి.. వారి ఆధార్ కార్డు వివరాల ద్వారా కుటుంబ సభ్యలు గురించి తెలుసుకునేందుకు విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) బృందాన్ని బాలేశ్వర్‌కు పలిపి ంచాలని అనుకున్నారు. కానీ ఈ ప్రమదంలో చాలామంది చేతి వేళ్లు బాగా దెబ్బతిన్నాయి.

మిగతా 2 లో...

## ఆగని ధరణి దుమారం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:




ధరణి పోర్టల్ వివాదం తెలంగాణలో పెను రాజకీయ ప్రకంపనలనే రేపుతోంది. ఇటీవల నిర్మల్ కలెక్టరేట్ ప్రారంభం, నాగర్ కర్నూల్ లో కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ పై చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రతిపక్ష పార్టీలలో కాకరేపుతున్నాయి. ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలిపేద్దాం అన్న పార్టీలనే బంగాళాఖాతంలో కలిపేయాలంటూ కాంగ్రెస్, బీజేపీలపై అగ్గిమీద గుగ్గిలంలా రెచ్చిపోయారు సీఎం కేసీఆర్. ధరణి పోర్టల్ గ్రామీణ స్థాయిలో అవినీతి వ్యవస్థకు చెక్ పెట్టిందని కేసీఆర్ అంటున్నారు. గత ప్రభుత్వాల హయాంలో రైతులు తమ భూములపై హక్కు పొందేందుకు, పాస్ బుక్ లో తమ భూములు నమోదు చేయించుకునేందుకు చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేదని, ధరణి పోర్టల్ వచ్చాక ఆ పరిస్థితి మారిపోందంటున్నారు. కేవలం ధరణి పోర్టల్ కారణంగా రైతులకు రైతు భరోసా మొదలు రైతు భీమా వరకు బటన్ నొక్కిన వెంటనే నేరుగా రైతుల ఖాతాల్లోకి చేరుతోందన్నారు. గత ప్రభుత్వాల్లో జరిగిన వీఆర్వోల దోపిడీకి ధరణి పోర్టల్ వల్లనే చెక్ పెట్టగలిగామని కేసీఆర్ పదే పదే చెబుతున్నారు. రైతుల భూములు ఒక్కసారి ధరణి పోర్టల్ లో నమోదైతే, వాటిని మార్చాలంటే ఎమ్మార్వో నుంచి రెవెన్యూ శాఖ మంత్రివరకు సైతం ఎవరూ మార్చలేరని, చివరికి సీఎం కేసీఆర్ సైతం మార్చడం సాధ్యంకాదన్నారు.

మిగతా 2లో...

### కాంగ్రెస్ పార్టీ హయాంలో

## అభివృద్ధి శూన్యం

### మంత్రి హరీష్ రావు



సంగారెడ్డి- ప్రభాత సూర్యుడు:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో పద్మశాలి, ఆరెకటిక సంఘం నూతన భవనానికి రాష్ట్ర అధికార శాఖ మంత్రి హరీష్ రావు గురువారం శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బి బి పాటిల్, ఎం ఎల్ ఏ మాణిక్ రావు, తెలంగాణ చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్. డిసిఎంఎస్ ఛైర్మన్ శివ కుమార్

మిగతా 2లో...

### చేప ప్రసాదంపై

## మళ్లీ దుమారం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

చేప ప్రసాదం.. కొన్ని దశాబ్దాలుగా హైదరాబాద్‌లో సాగుతున్న తంతు ఇది. ఇప్పటికి కొన్ని కోట్ల మంది ఆస్థమా రోగులు ఈ ప్రసాదాన్ని స్వీకరించారు. ఎంతో నమ్మకంతో ఉత్తర రాష్ట్రాల నుంచి కూడా రోగులు ఈ ప్రసాదం కోసం హైదరాబాద్ వస్తున్నారు. ఈ ప్రసాదం ఎలా పనిచేస్తుందో ఏమో గానీ.. జనం మాత్రం ఎగబడుతున్నారు. అదే సమయంలో మరోసారి వివాదానికి కేరాఫ్ అయింది. చేప ప్రసాదానికి ఎలాంటి శాస్త్రీయత లేదనే వారు కొందరు. అద్భుతంగా పనిచేస్తుందని మరి కొందరు వాదిస్తున్నారు. ఇంతకీ ఇది మెడిసినా.. లేక ప్రసాదమా..? అన్న చర్చ తెరమీదకు వచ్చింది. ఈ విషయంలో కోర్టు తీర్పు ధిక్కరణకు గురవుతోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. మృగశిర నెల ప్రారంభం కాగానే.. తెలుగు రాష్ట్రాల్లో ఆస్తమా రోగులకు గుర్తొచ్చేది బత్తిని

మిగతా 2లో...

## ప్రతి ఇంటికీ కెసిఆర్ సంక్షేమ ఫలాలు

- ప్రతీ ఇంటికి తిరిగి చూడండి
- కాంగ్రెస్ నేతలకు కల్వకుంట్ల కవిత సవాల్
- కేంద్రం చెరువుల మరమ్మత్తు పథకం విఫలం
- మనం ఇచ్చిన దానిలో పది పైసల మందం కూడా నిధులు ఇవ్వడం లేదు
- మంచి పనుల్లో దేశానికి తెలంగాణ ఉదాహరణ

ఎడపల్లి - ప్రభాత సూర్యుడు



తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందని ఇల్లే లేదని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఏం చేశారని సంబరాలు జరుపుకుంటున్నారు అని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నేతలు ఇంటింటికి తిరిగి ఫలాలు ఎలా అందుతున్నాయో చూడాలని సవాల్ విసిరారు. మంచి పనులు చేయడంలో దేశానికి తెలంగాణ ఉదాహరణగా నిలిచిందని తెలిపారు. మిషన్ కాకతీయ పథకాన్ని కాపీ కొట్టిన కేంద్ర ప్రభుత్వం అమృత్ సరోవర్ పేరిట అమలు చేస్తున్న కార్యక్రమం విఫలమైందని, ఆ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం కారణంగా దేశంలో చెరువులు బాగవ్వడం లేదని విమర్శించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవంలో భాగంగా నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి లో జరిగిన చెరువుల పండుగ లో స్థానిక ఎమ్మెల్యే షకీల్ తో కలిసి కవిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ... చెరువులను బాగు చేయాలన్నదానికి వెనుక కారణమేంటన్నది ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడకముందు 75 ఏళ్ల

మిగతా 3లో...

## సుప్రీంకోర్టులో అవినాష్ రెడ్డి, మాగుంట రాఘవ బెయిల్స్ భవిష్యత్

### - శుక్రవారమే విచారణ !



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డికి ఇచ్చిన ముందస్తు బెయిల్ ను రద్దు చేయాలంటూ... సునీత దాఖలు చేసుకున్న పిటిషన్ ను శుక్రవారం సుప్రీంకోర్టులో మెన్షన్ చేసే అవకాశం ఉంది. గురువారం సుప్రీం వెకేషన్ బెంచ్ ముందు నేడు సునీత తరఫు సీనియర్ లాయర్ సిద్ధార్థ్ లూథ్రా ప్రస్తావించారు. ఈ మేరకు సునీత పిటిషన్‌ను శుక్రవారం మెన్షన్ చేయడానికి సుప్రీంకోర్టు అనుమతించింది. అవినాశ్‌కు గత నెల 31న తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సునీత

మిగతా 2లో...

## రెజ్లర్ల 5 డిమాండ్లు..
# 15 వరకూ వేచిచూడమన్న కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)
నిరసన చేపట్టవద్దని మంత్రి కోరారని చెప్పారు. మహిళా రెజ్లర్ల భద్రతను తాము చూసుకుంటామని కూడా హామీ ఇచ్చారని తెలిపారు. తాము సైతం రెజ్లర్లపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను వెనక్కి తీసుకోవాలని కోరామని, అందుకు మంత్రి అంగీకరించారని చెప్పారు. 15న దర్యాప్తు పూర్తి, 30న డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు కాగా, రెజ్లర్లతో సమావేశానంతరం మీడియాతో మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ, ఆరు గంటల సేపు సుదీర్ఘంగా రెజ్లర్లతో తాను చర్చలు జరిపినట్టు చెప్పారు. ఈనెల 15వ తేదీ కల్లా దర్యాప్తు పూర్తవుతుందని, చార్జిషీటు సమర్పిస్తారని తాను రెజ్లర్లకు హామీ ఇచ్చినట్టు తెలిపారు. డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు ఈనెల 30న జరుపుతామని మంత్రి తెలిపారు.

**రెజ్లర్ల డిమాండ్లివే..**

కాగా, జాతీయ మీడియా కథనాల ప్రకారం, మంత్రి అనురాగ్ ఠాకూర్ ముందు రెజ్లర్లు 5 డిమాండ్లను ఉంచారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్ష పదవిని మహిళకు అప్పగించాలని, సమాఖ్యలో బ్రిజ్ భూషణ్, ఆయన కుటుంబ సభ్యులకు చోటు కల్పించరాదని, రెజ్లింగ్ సమాఖ్యలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో పాలక మండలికి ఎన్నికలు నిర్వహించాలని, జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తతల కారణంగా తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని రెజ్లర్లు డిమాండ్ చేశారు.

## ఆచూకి దొరకని
# 83 మంది వివరాలు

(మొదటిపేజీ తరువాయి)
ఇది ఫలించలేదు. ఇప్పుడు కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే సంచార్ సాథీ పోర్టల్‌ను వినియోగిస్తున్నారు. 64 మృతదేహాలను ఈ పోర్టల్ ఆధారంగా పరీక్షించగా 45 కేసుల్ని విజయవంతంగా గుర్తించారు. వినియోగదారులు తమ పేరుపై ఎన్ని సిమ్‌కార్డులు జారీ అయ్యాయో తెలుసుకునేందుకు, పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్లను బ్లాక్ చేసేందుకు ఈ వెబ్‌సైట్‌ను ఉద్దేశించిన విషయం తెలిసిందే. ఐటీ శాఖకూ మంత్రిగా ఉన్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవే దీనిని ఈ మధ్యే ప్రారంభించారు. మృతుల ఫొటోల ఆధారంగా వారి ఫోన్ నంబర్లు, ఆధార్ వివరాలను ఈ పోర్టల్ బయటపెట్టింది. వీటి ఆధారంగానే కుటుంబ సభ్యుల్ని సంప్రదించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రమాదం జరగడానికి కొద్దిసేపటి ముందు అక్కడి సెల్‌ఫోన్ టవర్ల ద్వారా ఏయే కాల్స్ వెళ్లాయో తెలుసుకుని, ఆ తర్వాత ఆగిపోయిన ఫోన్లతో ఆ వివరాలను క్రోడీకరించే ప్రయత్నం చేస్తున్నారు.



## కాంగ్రెస్ పార్టీ హయాంలో
# అభివృద్ధి శూన్యం

(మొదటిపేజీ తరువాయి)
తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ గతంలో జహీర్ బాద్ లో టాంకర్ లతో తాగు నీరు ఇచ్చేవారు...కానీ సీఎం కేసిఆర్ ఆలోచన తో ఇంటి ఇంటి నల్లా పెట్టి తాగు నీరు ఇస్తున్నం. ప్రభుత్వ ఆసుత్రుల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. జహీర్ బాద్ లో 50 పడకల ఎం సి హెచ్ హాస్పిటల్ నిర్మాణం చేస్తున్నాం. 16 నుండి గర్భిణీ లకు ఆరోగ్యంగా, బలంగా ఉండటం కోసం కేసిఆర్ న్యూట్రీషన్ల కిట్ పంపిణీ చేస్తాం. 6 లక్షల మందికి ఏడాదికి రెండు సార్లు కేసిఆర్ న్యూట్రీషన్ల కిట్ ఇవ్వబోతున్నం. జహీర్ బాద్ లో త్వరలోనే 700 డబుల్ బెడ్ రూం ఇండ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని అన్నారు. సొంత జాగ ఉన్నవారికి ఇండ్ల నిర్మాణం కోసం మూడు లక్షల రూపాయలు మీ ఖాతా లో వేయబోతున్నము. కర్ణాటక లో మూడు రోజులకు ఒకసారి తాగు నీరు ఇస్తారు. కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటక లో 600 పించన్ ఇస్తున్నారు. రెండు వేల పింఛన్లు యెందుకు ఇవ్వడం లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసింది ఏం లేదు. కాంగ్రెస్ పార్టీ హయాంలో అభివృద్ధి శూన్యం. కర్ణాటక లో 24 గంటల కరెంట్ యెందుకు ఇవ్వడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల మీద ప్రేమతో అన్ని రకాల అభివృద్ధి ,సంక్షేమ పథకాలను తీసుకువచ్చామని అన్నారు.

### జహీరాబాద్‌లో మంత్రి హరీష్ రావు పర్యటన

సంగారెడ్డి జిల్లా జహీర బాద్ మున్సిపాలిటీ పరిధిలో హోతి (కే) లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయం లో నిర్మాణ పనులు మంత్రి హరీష్ రావు గురువారం పరిశీలించారు. వేగంగా ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వలని అధికారులకు ఆదేశించారు. తరువాత అయన జహీరాబాద్ పట్టణంలో ఆరెకటిక సంఘం నూతన భవనానికి శంకుస్థాపన చేసారు. ఇదే కార్యక్రమంలో నూతనంగా నిర్మిస్తున్న పద్మశాలి భవన పనులను కుడా మంత్రి పరిశీలించారు. అయన వెంట జిల్లా కలెక్టర్ శరత్ కుమార్ ఇతర అధికారులు వున్నారు.

## కమలంలో
# కోవర్టుల కల్లోలం

(మొదటిపేజీ తరువాయి)
ఇతర సమాచారాన్ని బీఆర్ఎస్‌కు ఉప్పు అందిస్తున్నారని ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నమాట. ఇప్పటి వరకు ఈ ఆరోపణలు వేరే పార్టీలో ఉండే వాళు చేస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు అదే పార్టీకి చెందిన నేతలు వీటిని సమర్థిస్తున్నారు. తాజాగా బిజేపి నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపుతున్నాయి. తెలంగాణా బిజేపిలో కేసిఆర్ కోవర్టులున్నారని తేల్చి చెప్పేశారు. పార్టీలో జరుగుతున్న అంతర్గత సమావేశాల్లోని కీలక విషయాలు నేరుగా కేసిఆర్‌కు చేరవేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. కేసిఆర్‌కు నమ్మిన బంటులుగా ఉంటూ బిజేపికి చేటు చేస్తున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణ బిజేపిలో ఉన్న కేసిఆర్ కోవర్టుల పేర్లు ఇప్పటికే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని, పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు నందీశ్వర్ గౌడ్. కాబట్టే కోవర్టులపై అధిష్టాన పెద్దలకు ఫిర్యాదు చేసానంటున్నారు. తెలంగాణ బిజేపి వ్యవహారాల ఇన్ ఛార్జ్ తరుణ్ చుగ్, సునీల్ బన్సల్‌కు కోవర్టు పేర్లు చెప్పడంతోపాటు ఆధారాలను సమర్పించానని తెలిపారు. త్వరలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారి పేర్లు సైతం వెల్లడిస్తానని తెలిపారు. తెలంగాణలో బిజేపికి లక్షల మందికిపైగా కమిటెడ్ కార్యకర్తలున్నారని, వారిని గందరగోళ పరిచేలా ఓ నలుగురు నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు నందీశ్వర్ గౌడ్. పార్టీకి నష్టం చేసేలా ఇష్టమొచ్చిన కామెంట్స్ చేస్తుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తున్నారు. త్వరలో బిజేపిలోని కేసిఆర్ కోవర్టుల పేర్లు మీడియా ముఖంగా వెల్లడిస్తానని తెలిపారు నందీశ్వర్ గౌడ్.ఇదిలా ఉంటే ఇప్పటికే తెలంగాణ బిజేపిలోకి ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన సీనియర్లు సైతం ఇప్పుడు అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, విజయశాంతి ఇలా చెప్పుకుంటూ పోతే మరికొందరు బయటపడుతున్నారు. తెలంగాణాలో బిజెపి సత్తా చూపిస్తాం వచ్చేస్తున్నాం అంటూ గొప్పలు చెప్పివారు సైలెంట్ అయిపోయారు. తెలంగాణలో ఆపరేషన్ ఆకర్ష్ అంటూ ఇతర పార్టీ నేతలకు గాలం వేసేందుక ఏర్పాటు చేసిన చేరికల కమిటీ చైర్మెన్ ఈటెల సైతం విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల పొంగులేటి, జూపల్లి వంటి కీలకనేతలను బిజేపిలోకి లాగేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. అంతే కాదు వారిని ఆహ్వానించడానికి వెళ్లిన ఈటెలను, నువ్వే కాంగ్రెస్‌లోకి వచ్చేయమంటూ ఒప్పించే ప్రయత్నం చేసారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలా తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తామంటూ ఏర్పడ్డ బీజేపీ వలసల కమిటి పనితీరు అంతంతమాత్రంగానే ఉంది. దీనికి తోడు కీలక నేతల మధ్య అంతర్గత విభేదాలు పచ్చగడ్డి వెయ్యకున్నా భగ్గుమంటూనే ఉన్నాయి. ఈటెలకు వ్యతిరేకంగా బండి టీమ్ పని చేస్తుందనే విమర్శలు ఓవైపు. పార్టీలో ఉండాలా పొంగులేటి చెప్పినట్లు గోడ దూకేద్దామా అనే సందేహం ఈటెల ఉన్నట్లు తెలుస్తోంది. కొండా విశ్వేశ్వరరెడ్డి సైతం బీజేపితో అంటిముట్టనట్లు వ్యవహరిం చడం అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదోరోజు ఆయన జారుకుంటారా అనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఉంటే విజయశాంతి సైతం బిజెపిలో ఇదివరకు ప్రదర్శించిన జోష్ తగ్గిం చారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఓ వైపు తెలంగాణలో కీలక నేతలను తమ పార్టీలోకి లాగుతూ బలం పెంచుకునే దిశగా కాంగ్రెస్ వేగంగా అడుగులు వేస్తుంటే, కేంద్రంలో చక్రం తిప్పుతున్న బిజేపి మాత్రం తెలంగాణలో అంతర్గత కుమ్ములాటలతో అయోమ యంలో పడింది. కాంగ్రెస్‌లో విభేదాలు లేవా అని కాదు పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఎన్ని ఉన్నా తెలం గాణాలో కీలక నేతలను ఆకర్షించడంలో కాంగ్రెస్ ఓ నాలుగు ఆకులు ఎక్కువే చదివిందని చెప్పవచ్చు. తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలో అంతర్గత కుమ్ములాటలపై కేంద్ర పెద్దలు తీవ్ర అసంతృగా ఉన్నట్లు తెలుస్తోంది.

# ఆగని ధరణి దుమారం

(మొదటిపేజీ తరువాయి)
కేవలం రైతు మాత్రమే తన వేలిముద్రతో మార్పులు చేసుకోవడం సాధ్యమవుతుందని.. అంతలా రైతు భూములను పారదర్శకంగా డిజి టలైజేషన్ చేశామంటున్నారు కేసీఆర్. అధికారపార్టీ బీఆర్ఎస్ వాదన ఇలా ఉంటే.. ప్రతిపక్ష పార్టీల గొంతు మరోలా వినిపిస్తోంది.

ధరణి పోర్టల్ వల్ల అనేక అవక తవకలు జరుగుతున్నాయని కాం గ్రెస్, బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. హక్కుదారుడి పేరుతో పట్టా ఉండి, కొన్ని దశాబ్దాలుగా భూమి సాగు చేస్తున్నా ధరణి పోర్టల్ లో మాత్రం హక్కుదారుడి పేరుతో కాకుండా వేరే వారి పేరుతో సాగుభూమి నమోద వుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా మండలాల్లో ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ ఆపరేటర్ల వ్యవస్థలో అనేక లోపాలున్నాయంటున్నారు. భూములు రికార్డుల నుండి తొలగించి, వాటిని ధరణిలో చేర్చాలంటే లంచాలు డిమాండ్ చేస్తున్నారంటూ కొందరు ఆపరేటర్లపై విమర్శలు గుప్పిస్తున్నారు. వ్యవసాయ భూములు డిజిటలైజేషన్ చేయడం ద్వారా నేరుగా లబ్ధిదారులైన రైతులకే ప్రభుత్వ పథకాలు వర్తించేలా చేయడంతో పాటు ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలకు చెక్ పెట్టాలనేది బీఆర్ఎస్ సర్కార్ ఉద్దేశ్యం. ఆలోచన మంచిదే అయినా ఆచరణలో సమస్యలు తలెత్తితే విమర్శలు తప్పవు. ధరణి పోర్టల్ విషయంలో ఇదే జరుగుతోందని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ప్రభుత్వం సంకల్పం మంచిదైనా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు సమస్యలు ఎదుర్కోవడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కుంటోంది. ధరణి పోర్టల్ వేగంగా అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో మండలానికో ఆపరేటర్లను నియమించింది కేసీఆర్ సర్కార్. ఎమ్మార్వోలకు సహకరిస్తూ సాంకేతిక లోపాలను సరిదిద్దుతూ రైతుల భూములను డిజిటలైజేషన్ చేయాలి. కానీ ఇప్పుడు అదే ఆపరేటర్ల వ్యవస్థ ధరణి పోర్టల్ ఇంతలా విమర్శలు ఎదుర్కోవడానికి ప్రధాన కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. రికార్డులలో ఉన్న భూములు తొలగించి, తిరిగి వాటిని చేర్చడానికి లంచాలు డిమాండ్ చేయడమనేది ప్రధానంగా ధరణిపై వస్తున్న ఆరోపణ. రహదారుల ప్రక్కన ఉన్న భూములను ధరణి పోర్టల్ లో కలిపేయడం, భూ యజమానికి సమాచారం లేకుండా హక్కుదారుల పేర్లు తొలిగించడం, భూయజమాని బ్రతికే ఉన్నా.. చనిపోయినట్లుగా చిత్రీకరించి, ఆ భూమిని మరొకరిపేరుతో ధరణి పోర్టల్ లో నమోదు చేయడం ఇలా ఒకటేమిటి అనేక అవకతవకలున్నాయంటున్నాయి ప్రతిపక్షపార్టీలు. తాము అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలిపేస్తామంటూ తీవ్ర విమర్శలతో విరుచుకుపడుతోంది కాంగ్రెస్ పార్టీ. బీజేపీ సైతం నిరసనలు, ఆరోపణలతో ధరణి పోర్టల్ కు వ్యతిరేకంగా పోరాడుతోంది. అయితే ప్రతిపక్ష పార్టీలకు గట్టి కౌంటర్ ఇవ్వడంతోపాటు ధరణి పోర్టల్ విషయంలో వెనక్కు తగ్గబోమన్నట్లుగా తాజాగా కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ధరణి పోర్టల్ ఎత్తివేస్తే తిరిగి మళ్లీ జమిందారీ వ్యవస్థ వస్తుంది. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలు సైతం ధరణి పోర్టల్ పై ప్రశంసల కురిపిస్తున్నాయి. సమస్యలు పరిష్కరిస్తాం కానీ ధరణి పోర్టల్ ఎత్తివేసే ప్రసక్తేలేదంటోంది బీఆర్ఎస్. ధరణి పోర్టల్ అంశంపై సీఎం కేసీఆర్ పదే పదే వ్యాఖ్యలతో తెలంగాణలో మరోసారి ధరణి పోర్టల్ పొలిటిక్ అగ్గి రాజేయడంతోపాటు రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ప్రధాన అస్త్రంలా మారుతుందా అనేది ఆసక్తికరంగా మారింది.

## చేప ప్రసాదంపై
# మళ్లీ దుమారం

(మొదటిపేజీ తరువాయి)
సోదరులు. ఎందు కంటే మృగశిర కార్తెనాడు వాళ్లు ఇచ్చే చేప ప్రసాదం అంత ఫేమస్. సుమారు 175 ఏళ్లుగా.. వాళ్లు ఈ చేప ప్రసాదాన్ని ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు. ఏటా కొన్ని లక్షల మంది ఈ ప్రసాదాన్ని భారీ క్యూలైన్లలో నిలబడిమరీ స్వీకరిస్తున్నారు. వారిలో చాలా మంది ఆస్తమా అదుపులోకి వచ్చిందని చెప్తున్నారు. అయితే ఇదే చేప ప్రసాదంపై పలు విమర్శలు కూడా ఉన్నాయి. చేప ప్రసాద పంపిణీని జన విజ్ఞాన వేదిక మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఎలాంటి శాస్త్రీయ నిర్ధారణ లేకుండా చేప ప్రసాదాన్ని అక్రమంగా పంపిణీ చేస్తున్నారనేది వారి ఆరోపణ. దీనిపై 2013లో హైకోర్టును ఆశ్రయించింది జన విజ్ఞాన వేదిక. ఈ మందు వల్ల ఏమైనా నష్టాలు ఉన్నాయా అన్నదానిమీద కూడా ఎలాంటి నిర్ధారణ చేయలేకపోయారు.

దీంతో దీన్ని 'మందు' అని పిలవద్దని హైకోర్టు ఆదేశించింది. కానీ 'ప్రసాదం' పేరుతో బత్తిన సోదరులు దీన్ని పంపిణీ చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా చేప ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు బత్తిని సోదరులు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శుక్రవారం(ఈ నెల 9) నుంచి రెండ్రోజుల పాటు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. పంపిణీకి మూడ్రోజుల ముందు నుంచే ప్రసాదం కోసం యూపీ, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి ఆస్తమా రోగులు హైదరాబాద్‌కు తరలివస్తున్నారు. అయితే చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తే కోర్ట్ దిక్కరణ కింద కేసు పెడతామంటోంది జన విజ్ఞాన వేదిక. ప్రభుత్వం దీనికి ఏర్పాట్లు చేయడం సరికాదంటున్నారు. చేప ప్రసాదం పంపిణీకి ముగింపు పలకాలని డిమాండ్ చేస్తున్నారు. బాలల హక్కుల సంఘం వంటి ఆర్గనైజర్స్ కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. పసుపు పేస్టుతో ఉన్న కొరమీను చేపను మనుషుల నోట్లోకి వదిలి జబ్బు పోగొడుతుందంటే ఎలా నమ్మేది అంటునారు జన విజ్ఞాన వేదిక సభ్యులు.నాంపల్లిలో ట్రాఫిక్ ఆంక్షలుజూన్ 9న శుక్రవారం నుంచి మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీ ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమానికి ఏర్పాట్లను పూర్తి చేశారు అధికారులు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ఈ ప్రసాదం కోసం ప్రజలు తరలి వస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పంపిణీ ప్రారంభించనున్నారు. మరుసటి రోజు అంటే శనివారం ఉదయం వరకు ప్రసాదం పంపిణీ ఉంటుంది. ఉదయం 8 గంటలకు చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం మొదలు కానుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వెల్లడించారు. దీని కోసం రాష్ట్ర నుంచే కాకుండా దేశవ్యాప్తంగా భారీగా జనం వస్తారని అన్నారు. అందుకే ఎవరికీ ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. సాధారణ ప్రజలు, వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలకు వేర్వేరుగా కౌంటర్లు పెట్టామన్నారు. చేప ప్రసాదం కోసం భారీ సంఖ్యలో జనం రానున్న వేళ ఆ పరిసరాల్లో అధికారులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు ఇవాళ్టి(గురువారం) సాయంత్రం 6 గంటల నుంచి అమల్లోకి రానున్నాయి.

ఈ డైవర్షన్స్ శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు అమల్లో ఉంటాయి. పరిస్థితి బట్టి మార్పులు చేర్పులు చేస్తామని పోలీసు అధికారులు చెప్పారు. ఎంజే మార్కెట్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వైపు వెళ్లే వెహికల్స్?ను అబిడ్స్ జీపీవో, నాంపల్లి స్టేషన్? మీదుగా పోనిస్తారు. బేగంబజార్ ఛత్రి, ఎంజే బ్రిడ్జి నుంచి నాంపల్లి వైపు వచ్చే వెహికల్స్?ను దారుసలాం, ఏక్ మినార్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. అసెంబ్లీ జంక్షన్ నుంచి నాంపల్లి స్టేషన్, అఫ్జల్‌గంజ్ వైపు వచ్చే వెహికల్స్ ను బషీర్?బాగ్ ?ఏఆర్ పెట్రోల్ ?పంప్, బీజేఆర్ విగ్రహం మీదుగా డైవర్ట్ చేస్తున్నారు. చేప ప్రసాదం తీసుకునేందుకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం కల్పించారు పోలీసులు. నాంపల్లిలోని గృహకల్ప, గగన్ విహార్, చంద్రవిహార్, ఎంఏఎం గర్ల్స్ జూనియర్ కాలేజీ, ఇంటర్ బోర్డు వద్ద వాహనాలు పార్క్ చేసుకోవచ్చు. భారీ వాహనాలను మాత్రం గోషామహల్ పోలీస్ స్టేడియంలో పార్క్ చేయాలి. బైక్?లను భీమ్ నగర్, గృహకల్ప, బీజేపీ ఆఫీస్ వద్ద మాత్రమే పార్క్ చేయాలి. పాస్‌లు ఉన్న వీఐపీలు తమ వాహనాలను సీడబ్ల్యూసీ గోడౌన్స్ పార్కింగ్ ఏరియాలో ఉంచాలి.


# సుప్రీంకోర్టులో అవినాష్ రెడ్డి, మాగుంట రాఘవ బెయిల్స్ భవిష్యత్

(మొదటిపేజీ తరువాయి)
సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అవినాశ్‌పై మోపిన అభియోగాలన్నీ చాలా కీలకమైనవని పిటీషన్‌లో సునీత పేర్కొన్నారు. సీబీఐ మోపిన అభియోగాలను హైకోర్టు సరిగ్గా పరిగణలోకి తీసుకోలేదని పిటిషన్‌లో సునీత పేర్కొన్నారు. హైకోర్టు తీర్పులో కొన్ని లోపాలున్నాయని కూడా సునీత తెలిపారు. అవినాశ్ ముందస్తు బెయిల్‌ను సీబీఐ సైతం వ్యతిరేకిస్తోందని పిటిషన్‌లో వెల్లడించారు. సునీత పిటీషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంలో సీబీఐ సైతం వాదనలు వినిపించే అవకాశం ఉంది. నాంపల్లి కోర్టు లో వివేక కేస్ విచారణను జూన్ 16 కు వాయిదా వేసింది సిబిఐ కోర్టు. భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి లను కోర్ట్ లో హాజరు పరిచారు. ఇప్పటికే భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ వేశారు. శుక్రవారం కోర్టు తీర్పు వెల్లడించనుంది. తన ఆరోగ్యం దృష్ట్యా బెయిల్ ఇవ్వాలని భాస్కర్ రెడ్డి కోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్ ను పరిగణలోకి తీసుకున్న కోర్టు అటు భాస్కర్ రెడ్డి లాయర్ ఇటు సీబీఐ వాదనలను వింది. అలాగే ఇంప్లీడ్ గా ఉన్న సినీత కూడా వాదనలు వినిపించారు. భాస్కర్ రెడ్డి ఆరోగ్య దృష్ట్యా బెయిల్ ఇవ్వాలని ఉమామహేశ్వర్ రావు కోరగా..బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ వాదనలు వినిపించింది. అయితే వాదనలను రాతపూర్వకంగా ఇవ్వాలని కోర్టు సూచించింది. తీర్పును శుక్రవారం ప్రకటించే అవకాశం ఉంది. మరో వైపు ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితుడిగా ఉన్న మాగుంట రాఘవ బెయిల్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. రాఘువ బెయిల్‌పై కూడా శుక్రవారం విచారించిందుకు సుప్రీం అనుమతి ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించి నిన్న రాఘువకు రెండు వారాల మధ్యంతర బెయిల్‌ను ఢిల్లీ హైకోర్టు మంజూరు చేసింది. మాగుంట రాఘవకు మధ్యంతర బెయిల్‌కు ఆయన చూపిన కారణాలు సరైనవి కావని ఈడీ పేర్కొంది. ఈ క్రమంలో రాఘువ బెయిల్‌పై రేపు విచారణ చేపట్టేందుకు సుప్రీం కోర్టు వెకేషన్ బెంచ్ అంగీకారం తెలియజేసింది.

## సంపాదకీయం

# ఆర్థికంలో బ్రైట్ స్పాట్‌గా ఇండియా

ప్రస్తుత మాంద్యం పరిస్థితులను ఎదుర్కొంటూ మంచి వృద్ధితో ముందుకు సాగుతున్న దేశం ఏదైనా ఉంది అంటే అది కేవలం ఇండియా మాత్రమే. ప్రపంచ ఆర్థికంలో ఓ బ్రైట్ స్పాట్ గా పలు అంతర్జాతీయ స్థాయి సంస్థలు భారత్ ను ప్రశంసలతో ముంచెత్తిన సంగతులు విన్నాం. అయితే 24 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధిపై తన అంచనాలను ప్రపంచ బ్యాంకు సవరించింది. భారతదేశ జీడీపీ వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్ తగ్గించింది. అదే సమయంలో ప్రపంచ వృద్ధి పట్ల సానుకూల దృక్పథాన్ని కనబరిచింది. తాజా గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ నివేదిక ప్రకారం.. జనవరిలో ప్రకటించిన మునుపటి అంచనా 6.6 శాతతో పోలిస్తే 24 ఆర్థిక సంవత్సరంలో ఇండియా జీడీపీ వృద్ధి కొద్దిగా మందగించి 6.3 శాతానికి పరిమితం అవుతుందని పేర్కొంది. అధిక ద్రవ్యోల్బణం మరియు పెరుగుతున్న రుణాల ఖర్చులు జీడీపీ వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు ప్రపంచ బ్యాంకు తెలిపింది. అయితే ఇప్పుడిప్పుడే ద్రవ్యోల్బణం గాడిలో పడటం, ప్రభుత్వ సంస్కరణల ఫలితంగా 26 ఆర్థిక సంవత్సరం నాటికి వృద్ధి స్వల్పంగా మెరుగు పడుతుందని నివేదిక వెల్లడించింది. తలసరి జీడీపీ వృద్ధి పరంగా భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని నిలుపు కోగలదని అంచనా వేసింది. గతేడాది 3.1 శాతం వృద్ధి అనంతరం 2023లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన మందగమనాన్ని ఎదుర్కొంటుందని అంచనా వేయబడింది. ఈ సమయంలో వృద్ధి అంచనా 2.1 శాతం మాత్రమే. అధిక ద్రవ్యోల్బణ రేట్లను అరికట్టే లక్ష్యంతో కొనసాగుతున్న ద్రవ్య విధానాన్ని కఠినతరం చేయడమే దీనికి కారణమని చెప్పవచ్చు. ప్రపంచ వృద్ధి రికవరీ అంచనాలు జనవరిలో 1.7 శాతం కాగా.. ప్రస్తుత అంచనాలు ప్రపంచ వృద్ధిని 2.4 శాతం వద్దకు చేరుకోనున్నట్లు తెలుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారత ఆర్థిక వృద్ధి రేటు అంచనాను ప్రపంచ బ్యాంకు 6.3 శాతానికి తగ్గించింది. గత జనవరిలో ప్రపంచ బ్యాంకు ప్రకటించిన అంచనా కంటే ఇది 0.3 శాతం తక్కువ. అయితే.. ప్రైవేట్ కన్‌జంప్షన్, పెట్టుబడుల్లో భారతదేశం హాట్ స్పాట్‌లో ఉందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. సేవల రంగం వృద్ధి కూడా బలంగా ఉందని చెప్పింది. 2022 ద్వితీయార్థంలో క్షీణత తర్వాత, 2023లో తయారీ రంగంలో పరిస్థితి మెరుగుపడుతోంది. "2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ వృద్ధి రేటు మరింత మందగించి 6.3 శాతానికి చేరుకుంటుందని అంచనా. ఇది, జనవరి అంచనా కంటే 0.3 శాతం తక్కువ" - ప్రపంచ బ్యాంక్‌భారత్‌లో వృద్ధి రేటు మందగించడానికి అధిక ద్రవ్యోల్బణం, రుణ వ్యయాలు పెరగడం కారణమని, దీని వల్ల ప్రైవేట్ వినియోగంపై ప్రభావం పడుతుందని ప్రపంచ బ్యాంక్ తన రిపోర్ట్‌లో పేర్కొంది. వరల్డ్ బ్యాంక్ రిపోర్ట్ ప్రకారం, "భారత్‌లో వివిధ సంస్కరణలు అమలు చేస్తున్న నేపథ్యంలో, ఆశించిన స్థాయికి ద్రవ్యోల్బణం దిగి రావడం వల్ల 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి కొంతమేర పుంజుకోవచ్చు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు ఀ వర్ధమాన ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారతదేశం నిలుస్తుంది". 2023 ప్రారంభంలో, భారతదేశ ఆర్థిక వృద్ధి మహమ్మారి ముందు దశాబ్దంలో సాధించిన స్థాయి కంటే తక్కువగా ఉంటుందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. అధిక ధరలు, పెరుగుతున్న అప్పుల వ్యయం కారణంగా ప్రైవేట్ పెట్టుబడులు ప్రభావితం కావడమే దీనికి కారణంగా వెల్లడించింది. గ్లోబల్ ఎకనమిక్ ప్రాస్పెక్ట్స్‌పై తన తాజా నివేదికలో, 2022లో 3.1 శాతంగా ఉన్న ప్రపంచ వృద్ధి రేటు 2023లో 2.1 శాతానికి తగ్గుతుందని వరల్డ్ బ్యాంక్ వెల్లడించింది. చైనా మినహా, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు ఀ వర్ధమాన ఆర్థిక వ్యవస్థల వృద్ధి రేటు గత సంవత్సరంలో నమోదైన 4.1 శాతం నుంచి ఈ సంవత్సరం 2.9 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది. ఇది, వృద్ధి రేటులో భారీ క్షీణతను చూపుతోంది. ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రెసిడెంట్‌గా కొత్తగా పగ్గాలు చేపట్టిన అజయ్ బంగా, "పేదరికాన్ని తగ్గించడానికి, సంపద పెంచడానికి ఖచ్చితమైన మార్గం ఉపాధి కల్పన. వృద్ధి మందగిస్తే ఉద్యోగాల సృష్టి కూడా కష్టమవుతుంది. వృద్ధి రేటు అంచనాలు 'విధి రాత' కాదని గమనించడం ముఖ్యం. దీనిని మార్చడానికి మనకు అవకాశం ఉంది. అయితే మార్పు కోసం మనమందరం కలిసి పని చేయాలి" అని చెప్పారు. ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా, భారత సంతతికి చెందిన అజయ్ బంగా గత శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించారు.



## ట్రబుల్ ఐటీగా బాసర

అదిలాబాద్ - ప్రభాత సూర్యుడు

బాసర ట్రిపుల్ ఐటీ మళ్లీ ట్రబుల్ ఐటీగా మారుతోంది. విద్యార్థుల ఆందోళనలతో గతేడాదంతా విశ్వవిద్యాలయంలో గొడవలు జరగ్గా, తాజా ఉన్నతాధికారుల మధ్య విభేదాలు వెలుగుచూశాయి. తెలంగాణ వర్సిటీ తరహాలో ట్రిపుల్ ఐటీలోనూ అధిపత్య వివాదం మొదలైంది. వర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్ మధ్య విభేదాలు వెలుగులోకి వచ్చాయి. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో గతేడాది ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ సతీష్ కుమార్‌ను ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా నియమించింది. విద్యార్థుల వ్యవహారాలకు సంబంధించిన బాధ్యతలు ఆయనకు అప్పగించింది. ఈ క్రమంలో నెల క్రితం డైరెక్టర్ సతీష్ కుమార్ చెక్ పవర్ రద్దైంది. దీంతో ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య వివాదం మొదలైంది. మరో విద్యార్థుల సెలవులకు సంబంధించి కూడా వర్సిటీలో వివాదం చోటుచేసుకుంది. గత నెల నిర్వహించిన జేఈఈ పరీక్షలు రాసేందుకు కొంత మంది విద్యార్థులు అనుమతి తీసుకొని వెళ్లారు. అయితే హఠాత్తుగా వారిని హాస్టల్ నుంచి చీఫ్ వార్డెన్ ఖాళీ చేయించారు. చీఫ్ వార్డెన్ వ్యవహరించిన తీరుపై డైరెక్టర్ సతీష్ కుమార్ సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఉన్నతాధికారుల మధ్య విభేదాలు, సెలవులు, విద్యార్థుల విషయంలో వివాదాల కారణంగా ట్రిపుల్ ఐటీ మరోసారి ట్రబుల్ ఐటీగా మారుతుందేమోనని అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

# ప్రతి ఇంటికీ కెసిఆర్ సంక్షేమ ఫలాలు

(మొదటిపేజీ తరువాయి)

క్రితం చెరువులు నిండుకుండలా ఉండేవని, ప్రజల జీవితమంతా చెరువు చుట్టే ఉండేదని గుర్తు చేశారు.

**చెరువు బాగుంటే ఊరు**

ఊరంతా చెరువుపై ఆధారపడి బ్రతికే పరిస్థితి అని తెలిపారు. ప్రపంచంలో ఏ దేశంలో అయినా చెరువు, నది ఉంటే ఆ సంస్కృతి, జనజీవితం వాటిపై ఆధారపడి ఉంటాయని స్పష్టం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రూ. 5 వేల కోట్ల వ్యయంతో 47 వేల చెరువులను మరమ్మత్తు చేసుకున్నామని చెప్పారు. కాకతీయులు నిర్మించిన గొలుసుకట్టు చెరువులను రక్షించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని, అవి ఎప్పటికీ ఎండిపోవద్దన్నది సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద దాదాపు 20 వేల చెరువులను నింపుతున్నామని, కాబట్టి ఎండకాలంలోనూ రాష్ట్రంలో చెరువుల ఎండిపోవడం లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి పాలనలో తెలంగాణలో ప్రాంతంలోని నీటి వనరులను కొల్లగొట్టారని చెప్పారు. దాని వల్ల మనం ఆగమైనందునే ఇవాళ చెరువులను మంచిగచేసుకుంటున్నామన్నారు. చెరువు మంచిగయ్యి పంటలు పండడం మొదలైతే ఊరుఊరంతా బాగుంటుందని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ రైతాంగంపై అధికంగా దృష్టి సారించారని తెలిపారు. చెరవులు బాగుచేసుకున్న తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వాటిల్లో చేప పిల్లలను వేస్తున్నదని, దాంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల మందికి ఉపాధి లభిస్తోందని వివరించారు. ఏదైనా ఒక్క మంచిపని జరిగితే దాని ఫలితాలు ప్రత ఒక్కరికి అందుతాయన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల్లో కనీసం ఏదో ఒక పథకం రాని ఇల్లు తెలంగాణలో లేదని స్పష్టం చేశారు. 10 సంవత్సరాల క్రితం సాగునీటి శాఖ మంత్రిగా ఉన్న సుదర్శన్ రెడ్డి కనీసం ఆయన సొంత గ్రామంలో కూడా 20 ? 30 మందికి పెన్షన్ ఇప్పించుకోలేదని ఆరోపించారు. పెన్షన్ వస్తున్న ఎవరైనా మరణిస్తేనే ఆ స్థానంలో కొత్త వాళ్లకు పెన్షన్ ను మంజూరు చేసేవారని తెలిపారు. అటువంటి పరిస్థితిలో దుఖంతో మనం తెలంగాణను తెచ్చుకున్నామన్నారు. కానీ ఈ రోజు ఊరిలో ఎంత మంది దరఖాస్తు చేస్తే అంత మందికి పెన్షన్ వస్తోందని, బీడీ కార్మికులకు కటాఫ్ డేట్ ను సడలించి మరీ పెన్షన్ ఇచ్చామని తెలిపారు. అధికారంలో సీఎం కేసీఆర్ ఉన్నారు కాబట్టి చివరిగా ఉన్న వాళ్ల వరకు ఫలాలు అందుతాయని చెప్పారు.

"కాంగ్రెస్ నాయకుడు మహేశ్ కుమార్ గౌడ్ లొల్లి చేస్తుండని ఆ పార్టీ వాళ్లు చిన్న పదవి ఇచ్చారు. పదవి ఇచ్చిన తర్వాత లొల్లి ఇంకొంచెం ఎక్కువ చేస్తున్నాడు. ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారని ఆయన మనల్ని ప్రశ్నిస్తున్నారు. మహేశ్ కుమార్ గౌడ్ అన్నా... ఒక్కసారి ఎడపల్లి వచ్చి చూడు అన్న. పెన్షన్లు , కేసీఆర్ కిట్ లు ఎన్ని ఇచ్చామో చూడు. అందుకే సంబరాలు చేసుకుంటున్నాము." అని మహేశ్ గౌడ్ కు కౌంటర్ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడాది మొత్తంలో రూ. 600 కోట్ల విలువైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసేదని, 2014 నుంచి ఇప్పటి వరకు కరూ. 12 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశాము కాబట్టి ఇవాళ సంబరాలు చేసుకుంటున్నామని తేల్చిచెప్పారు. గతంలో పండిన పంటను ఎక్కడ అమ్మాలో తెలియని పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు పంటకు పెట్టుబడి ఇవ్వడమే కాకుండా పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసే పరిస్థితిని తీసుకొచ్చామని తెలిపారు.

10 ఏళ్ల తెలంగాణలో ఒక్కొమెట్టు ఎక్కుతూ పైకి వస్తున్నామని, మొదటి ఐదేళ్లలో చెరువుల్లో పూడికలు తీసుకున్నామని, చెక్ డ్యాములు నిర్మించుకోవడమే కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించుకున్నామని, పెన్షన్లు ఇచ్చుకున్నామని వివరించారు. ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకోడానికి రూ. 3 లక్షల చొప్పున ఇచ్చే కార్యక్రమానికి త్వరలోనే శ్రీకారం చుట్టనున్నామని వెల్లడించారు. దాని పేరు గృహ లక్ష్మి పథమని స్పష్టం చేశారు. ఇంటి స్థలం లేని వారికి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ప్లాట్లు చేసి ఇచ్చే ప్రయత్నం స్థానిక ఎమ్మెల్యే షకీల్ చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, పథకాలను అన్ని రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని తెలిపారు. చెరువుల మరమ్మత్తు కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టిందని, అమృత్ సరోవర్ పేరిట దేశమంతా బీజేపీ ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని చెప్పారు. కానీ మనం చేస్తున్నదానిలో 10 పైసల మందం కూడా కేంద్రం ఆ కార్యక్రమానికి డబ్బులు ఇవ్వడం లేదని, దాని వల్ల చెరువులు బాగవ్వడం లేదని విమర్శించారు. దాదాపు 12-13 రాష్ట్రాల్లో చెరువుల మరమ్మత్తు కార్యక్రమం జరుగుతుందని ప్రస్తావించారు. అంటేమంచి పనులు చేయడంలో దేశానికి తెలంగాణ ఉదాహరణగా మారిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో జెడ్పీ ఛైర్మెన్ విఠల్ రావు పాల్గొన్నారు.

# కేరళకు రుతుపవనాల ఆగమనం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



అగ్నేయ అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం నాటికి వాయువ్య దిశగా పయనించి తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జూన్ 6 నుంచి 10వ తేదీ వరకు పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. తుపాను తీవ్రత, అరేబియా సముద్రంలో కేరళకు రుతుపవనాల ఆగమ నాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది మరో 6 గంటల్లో ఉత్తర దిశగా పయనించి మధ్య తూర్పు అరేబియా సముద్రంలో తుపానుగా మారే అవకాశం ఉందని కేంద్ర వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 6, 7 తేదీల్లో కేరళ తీరంలో బలమైన గాలులు, సముద్రాలు అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉంది. వచ్చే 5 రోజుల పాటు కేరళలో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. జూన్ 6 నుంచి 10 వరకు కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కేంద్ర వాతావరణ శాఖ తెలిపింది. 2021లో అరేబియా సముద్రంలో ఇలాంటి తుపాను ఏర్పడింది. అప్పట్లో దీనిని సైక్లోన్ యస్ అని పిలిచేవారు. ప్రస్తుతం జూన్ 8 లేదా 9వ తేదీల్లో రుతుపవనాలు కేరళను తాకుతాయని అంచనా. రానున్న 5 రోజులపాటు కేరళలోని వివిధ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని కేంద్ర వాతా వరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. 06-06- 2023: పతనంతిట్ట, ఇడుక్కి 07-06-2023: పతనంతిట్ట, అలప్పుజ 08-06-2023: అలప్పుజ, ఎర్నాకులం 09-06-2023: తిరువనంతపురం, కొల్లాం 10-06-2023 సెంట్రల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ తిరువనంతపురం, కొల్లాం, ఇడుక్కిలో అలర్ట్ ప్రకటించారు. అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. భారీ వర్షాలు అంటే 24 గంటల్లో 64.5 మి.మీ నుండి 115.5 మి.మీ. వరకూ ఉండనుంది. కేరళ-కర్ణాటక-లక్షద్వీప్ తీరాల్లో చేపల వేటకు వెళ్లరాదని కేంద్ర వాతావరణ శాఖ తెలిపింది. 06-06-2023: కేరళ - కర్ణాటక - లక్షద్వీప్ తీరాల వెంబడి గంటకు 35 నుండి 45 కి.మీ వేగంతో, అప్పుడప్పుడు గంటకు 55 కి.మీ వేగంతో బలమైన గాలులు, చెడు వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. 07-06-2023: కేరళ తీరం వెంబడి 40 నుండి 50 కిమీ వేగంతో, అప్పుడప్పుడు గంటకు 60 కిమీ వేగంతో బలమైన గాలులు, చెడు వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. 07-06-2023 నుండి 10-06-2023 వరకు: కర్ణాటక తీరం వెంబడి కొన్ని సందర్భాల్లో గంటకు 60 కి.మీ వేగంతో 40 నుండి 50 కి.మీ వేగంతో బలమైన గాలులు, చెడు వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది

## తెలంగాణలో చెరువులు నిండు కుండలా మారాయి

**-ఎమ్మెల్యే రమేష్ బాబు**



చందుర్తి - ప్రభాత సూర్యుడు

చందుర్తి మండలంలోని కట్టలింగంపేట గ్రామంలో 12లక్షల తో నిర్మించబోతున్న గంగమ్మ దేవాలయానికి శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే ఏమి వచ్చిందంటే ఒక్క కట్టలింగంపేట గ్రామానికే దేవాలయాల అభివృద్ధి కోసం 32 లక్షలు వచ్చాయంటే తెలంగాణ వస్తే ఏమి వచ్చిందో అర్థం అవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలలోకి అడుగుపెడుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో చెరువుల పండుగ జరుపుకుంటున్నామని అన్నారు. ఒక్క కట్టలింగంపేటలోని గురునాథం చెరువును అభివృద్ధి కోసం 42లక్షలు మంజూరు చేసుకొని మిషన్ భగీరథ ద్వారా అద్భుతంగా తీర్చిదిద్దుకున్నామని అన్నారు. ఇలాంటి వేసవికాలంలో మన చెరువులు నిండుకుండలుగా మరిపోయాయంటే ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం అని అన్నారు. కట్టలింగంపేట చెరువు పెద్దచెరువు అప్పుడు 1999లో ఎర్రచెరువు, పటేల్ చెరువు రెండింటిని కలిపి పెద్ద చెరువుగా చేయడం కోసం జర్మనీ నుండి 1కోటి రూపాయలు తీసుకొని వచ్చి మొత్తం 2మాసాల్లో పనులు పూర్తి చేస్తే ఇప్పుడు కాలువ వచ్చి అన్ని చెరువులు అనుసంధానం చేసుకొని చెరువులు అన్ని నింపుకున్నామని అన్నారు. వేములవాడ గుడి చెరువు 165 ఎకరాల చెరువు ఎప్పటికి ఎండి పోదు శాశ్వతంగా పరిష్కారం చేసుకున్నామని అన్నారు. రాజరాజేశ్వరి జలాశయం నుండి గుడి చెరువుకు 16కోట్లతో లిఫ్ట్ వేసుకున్నామని, తద్వారా గుడి చెరువు ఎండిపోయే పరిస్థితి ఎప్పటికి ఉండదని అన్నారు. ఒకప్పుడు నాట్లు వేద్దామంటే నీళ్లు లేని పరిస్థితి నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నీటి సంపదను పెంచుకొని ఇప్పుడు వడ్లు ఆరబోద్దామంటే జాగలేని పరిస్థితి ఏర్పడిందంటే 9సంవత్సరాలలో ఎంత అభివృద్ధి చెందామో అర్థం అవుతుందని అన్నారు. రానున్న కాలంలో బిసి బంధు కింద 1లక్ష రూపాయలు ఇచ్చే కార్యక్రమం రాబోతున్నదని, అర్హులైన వారికి విడతల వారికి అందరికి ఇచ్చుకుందామని అన్నారు. అలాగే దళితబంధు మొదటి విడతలో 100 యూనిట్లు పారదర్శకంగా మంజూరు చేసామని, రెండవ విడతలో 1100 యూనిట్లు రాబోతున్నాయని, పారదర్శకంగా అందిస్తామని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో భాగంగా ఎవరిజాగలో వారు ఇండ్లు కట్టుకుంటే వారికే 3 లక్షలు ఇచ్చే కార్యక్రమం కూడా వచ్చే 2మాసాల్లో ప్రారంభం కాబోతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భైరగోని లావణ్య, రుద్రదీగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, కౌన్సిలర్ యాచమనేని శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ లీకేజీ పై సిట్ చార్జ్ షీటు

(మొదటిపేజీ తరువాయి)

అనుబంధ అభియోగ పత్రం (ఛార్జ్ షీటు)లో మిగతా నిందితుల పేర్లను చేర్చే యోచనలో సిట్ అధికారులు ఉన్నారు. మరోవైపు డీఈ పూల రమేష్ అరెస్టుతో ఈ కేసు కొత్త మలుపు తిరుగుతోంది. నిందితుడు డీఈ పూల రమేష్ కొందరు అభ్యర్థులతో హైటెక్ మాస్ కాపీయింగ్ చేయించాడు. డీఈ ప్రశ్నా పత్రాన్ని దాదాపు 80 మందికి విక్రయించినట్లు సిట్ అదికారుల దర్యాప్తులో తేలింది. దీంతో ఈ కేసులో అరెస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మే వ తేదీన కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకున్న విద్యుత్ శాఖ డీఈ రమేష్ రెడ్డిని సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ క్రమంలోనే నిందితుడు షాకింగ్ విషయాలు చెప్పినట్లు తెలుస్తోంది. డీఈ రమేష్ ద్వారా ఓ మాజీ ఎంపీటీసీ కూతురు కూడా ఏఈఈ సివిల్, జనరల్ నాలెడ్జ్ పరీక్ష రాసినట్లు వెల్లడి అయింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో దర్యాప్తు వేగాన్ని పెంచిన సిట్ అధికారులు ఇటీవల వరంగల్ జిల్లా విద్యుత్ శాఖలో డీఈగా పని చేస్తున్న రమేష్ ను అరెస్ట్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే విచారణలో ఏఈఈ సివిల్, జనరల్ నాలెడ్జ్, డీఏఓ పరీక్షల ప్రశ్నాపత్రాలను 40 మందికి ఇవ్వడంతోపాటు హైటెక్ పద్ధతిలో మాస్ కాపీయింగ్ చేయించినట్లు తేలింది. ఈ క్రమంలోనే డీఈ రమేష్ ను విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని సిట్ అధికారులు నాంపల్లి కోర్టు అనుమతితో అతడిని ఆదివారం కస్టడీకి తీసుకున్నారు. విచారణలో కరీంనగర్ జిల్లా బొమ్మకల్ మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ కూతురు రమేష్ ద్వారా ఏఈఈ సివిల్, జనరల్ నాలెడ్జ్ పరీక్ష రాసినట్లు తేలింది. శ్రీనివాస్ ను కిలిసిన రమేష్ 75 లక్షలకు ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడి అయింది. ఈక్రమంలోనే ఆ ఎంపీటీసీ కూతురు పరీక్ష రాయగా... ఎలక్ట్రానిక్ డివైజ్ ద్వారా ఆమెకు రమేష్ జవాబులు చేర వేసినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఎంపీటీసీతో పాటు ఆయన కూతురును కూడా విచారించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఇలా ఇప్పటి వరకు విచారణలో మొత్తం 80 మందికి డీఈ రమేష్ ప్రశ్నాపత్రాలు అమ్మినట్లు గుర్తించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. చూడాలి మరి ముందు ముందు ఏం జరగనుందో.

## జనగణమన టీమ్ బీఆర్ఎస్‌లో చేరిక



**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** నిత్య జనగణమనతో ప్రజలను జాతీయ పండుగకు దగ్గర చేసేందుకు కృషి చేస్తున్న ఉత్తురి గంగాధర్ టీమ్ గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నిత్య జనగణమన తో జగిత్యాల ప్రజలకు జాతీయ భావాన్ని పెంచేందుకు వీరు కృషిచేస్తున్నారు. వీరు గతంలో కాంగ్రెస్ పార్టీ ని నమ్మినా ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ తెలంగాణకు దిక్కని ధినితోనే ప్రజలకు మేలని భావించిన గంగాధర్ బీఆర్ ఎస్ పార్టీలో చేరారు. ఒక్కసారిగా గంగాధర్ బీఆర్ ఎస్ లో చేరడంతో కాంగ్రెస్ తో సహా బిజెపి పార్టీలో చర్చ మొదలైంది. జాతీయ భావాన్ని ప్రజల్లో పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్న యు. గంగాధర్ లక్ష్యం బీఆర్ఎస్ పార్టీ తోనే సాధ్యమవుతుందని గంగాధర్ భావిస్తున్నట్లు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## గ్రామ స్థాయి స్వశక్తికరణ సదస్సుకు ఆహ్వానం



**తుగ్గలి - ప్రభాత సూర్యుడు:** ఈనెల 15,16 తేదీలలో పత్తికొండలో జరగనున్న "గ్రామస్తాయి నాయకుల స్వశక్తికరణ ప్రక్రియ" సదస్సు కు హాజరు కావాలని తుగ్గలి తహసీల్దార్ రవి, యంపిడిఓ సావిత్రి,తుగ్గలి ఎస్సై మల్లికార్జున ను రాయలసీమ డెవలప్మెంట్ సంస్థ వారు ఆహ్వానించారు. గురువారం రాయలసీమ డెవలప్మెంట్ సంస్థ రీజియన్ డైరెక్టర్ రామేశ్వరి బృందం సభ్యులు తహసీల్దార్,యంపిడిఓ మరియు తుగ్గలి పోలీస్ స్టేషన్ కార్యాలయాలకు వెళ్లి వారికి ఆహ్వాన పత్రికలను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుగ్గలి మండలంలోని వివిధ గ్రామాల్లోని యువతి, యువకుల నాయకత్వ నైపుణ్యాన్ని ప్రోత్సహించడం,గ్రామంలోని సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం కోసం సమిష్టిగా కృషి చేయడం,ప్రభుత్వ,ప్రభుత్వేతర సంస్థలతో అనుసంధానమైన వారికి కావలసిన అర్హతలను, వనరులను సాధించడం కోసం ఆర్డీటి పనిచేస్తుందన్నారు.పత్తికొండ లోని గోపాల్ ప్లాజా ఫంక్షన్ హాల్ లొ సదస్సు నిర్వహిస్తున్నామని, తుగ్గలి మండలంలోని గ్రామస్తాయి యువ నాయకులు,అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.ఈకార్యక్రమంలొ ఏరియా టీం లీడర్ రెహానాబీ,ఏరియా కో ఆర్డినేటర్లు రామాంజినేయులు,ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షణలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



**జగిత్యాల - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ సమగ్ర శిక్షణలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆ ఉద్యోగుల పక్షాన తపస్ గొల్లపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు బోయిన నరేష్ మొగిలి రవి లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం గొల్లపల్లి మండల తపస్ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులకు కూడా ఒక వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ తమ పక్షాన నిలబడి క్రమబద్ధీకరణకు కృషి చేయాలని కోరగా, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉన్న సిఆర్పి, ఎంఆర్సి లో విధులు నిర్వహిస్తున్న ఎంఐఎస్, సిసిఓ, మెసెంజర్ లవి న్యాయమైన డిమాండ్లని అన్నారు. వారంతా గత 15 ఏళ్లుగా పని చేయడం జరుగుతున్నదన్నారు. వివిధ హోదాల్లో ఉన్న వారి సేవలను గుర్తించి వెంటనే క్రమబద్ధీకరించేందుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తపస్ గొల్లపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయిన సురేష్ , మొగిలి. రవి తో పాటు సమగ్ర శిక్షణా ఉద్యోగులు శ్రీనివాస్, అశ్విని, లచ్చయ్య, రాజేందర్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

**నిజామాబాద్ - ప్రభాత సూర్యుడు:** నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం శివతాండలో విషాదం నెలకొంది. దొంగతనం నింద భరించలేక ఉరి వేసుకుని వందన అనే బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఫోన్ పౌచ్ లోని 600 దొంగిలించిందని వందన పై ఇంటిపక్క వ్యక్తుల దొంగతనం ఆరోపణలు చేసారు. వందన తన తల్లితో ఫోన్ మాట్లాడేందుకు పక్కింటి వ్యక్తి ఫోన్ తీసుకుంది. ఫోన్ పౌచ్ లో ఉన్న 600 రూపాయలు దొంగిలించిందని ప్రవీణ్ తో పాటు అతని తల్లి బులి భాయ్ ఆరోనించారు. చేయని తప్పుకు నింద వేశారని బాలిక మనస్తాపం చెందింది. దాంతో వందన ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య కు ప్రేరేపించిన ఇద్దరు వ్యక్తుల పై పోలీసులు కేసు నమోదు చేసారు.

# ప్రజల జీవనాధారం కాళేశ్వరం ప్రాజెక్టు

### రాష్ట్ర మహిళా గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



**జయశంకర్ భూపాలపల్లి - ప్రభాత సూర్యుడు**

రాష్ట్ర రైతులకు జీవనాధారం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ రికార్డు సమయంలో ప్రభుత్వం పూర్తి చేసిందని రాష్ట్ర మహిళా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి భూపాలపల్లి లోని అన్నారం బ్యారేజ్ వద్ద నిర్వహించిన సాగునీటి వేడుకలలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.సాగునీటి రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతి వివరాలను వివరిస్తూ రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రభుత్వం సాగునీటి రంగంలో చేపట్టిన మిషన్ కాకతీయ, భారీ ప్రాజెక్టుల నిర్మాణం, చెక్ డాంల నిర్మాణాలను తెలియజేస్తూ రూపొందించిన వీడియోలను వేడుకలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముందుగా సరస్వతి అన్నారం ప్రాజెక్టు ను గౌరవ ముఖ్య అతిథులు వీక్షించారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రాంత అవసరాలు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దార్శనికతతో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి చారిత్రాత్మక ఒప్పందం చేసుకున్నారని, రికార్డ్ సమయంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేశారని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం లాంటి భారీ ఎత్తుపోతల ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు సృష్టించిన అపోహలు అనుమానాలను పటాపంచలు చేస్తూ నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు విజయవంతంగా పూర్తి చేశారని, అందుకోసం వారు చేసిన కృషి ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు త్రాగునీటి సాగునీటి ఇబ్బందులతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఎండిపోయిన చెరువులు బావులు కాలిపోయే మోటర్లు రైతులు పడిన కష్టాలు చాలా అధికమని అన్నారు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితో 13 జిల్లాలకు, 31 నియోజక వర్గాలకు, 121 మండలాలకు, 1638 గ్రామాలకు మీరు సరఫరా చేసే కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని రికార్డు సమయంలో పూర్తి చేసుకున్నామని అన్నారు.సీఎం కేసీఆర్ సాగునీటి రంగంలో తీసుకున్న చర్యల కారణంగా 2014లో వరి సాగు లో 24 స్థానంలో ఉన్న తెలంగాణ నేడు రెండో స్థానానికి చేరుకుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ.ఎన్సీ నల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 24 గంటల పాటు ప్రత్యక్షంగా పర్యవేక్షించి రికార్డు సమయంలో వేగవంతంగా ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ప్రజలకు ఫలాలు అందించారని అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన లేజర్ షో, ప్రముఖ గాయని మంగ్లీ లైవ్ షో , సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అల రిం చాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి,భూపాలపల్లి శాసన సభ సభ్యులు గౌరవ శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డి గారు,వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ ఉ భూపాలపల్లి జిల్లా పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గండ్ర జ్యోతి రెడ్డి,భూపాలపల్లి జిల్లా జడ్పీ చైర్పర్సన్ జక్కు శ్రీహర్షిని రాకేష్, మహాదేవపూర్ ఎంపీపీ బి. రాణీబాయి రామారావు, సర్పంచ్ రమాదేవి శేకర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లు దివాకర్, ఇలా త్రిపాఠి, అసిస్టెంట్ కలెక్టర్ శివ శంకర్ ప్రసాద్,జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

# తెలంగాణ రన్‌ను విజయవంతం చేయాలి

### సీఎస్ శాంతి కుమారి



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 12 వ తేదీన నిర్వహించే తెలంగాణా రన్ లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతంచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కోరారు. తెలంగాణ రన్ నిర్వహణపై నేడు సచివాల యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీజీపీ అంజనీ కుమార్ తో సహా పలువురు సీనియర్ పోలీస్ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, హైదరాబాద్ లోని డా.బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని మైదానం నుండి జరిగే 2 కె, 4 కె రన్ లను ప్రధానంగా నిర్వహిస్తున్నామని, ఈ రన్ లో కనీసం నాలుగు వేల మంది రన్నర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. నగరంలోని యువత, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ సంస్థల ప్రతినిధులు, పోలీసులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఈ రన్ లలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సి.ఎస్. విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి జీఏడీ కార్యదర్శి శేషాద్రి, ఎస్.సి అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, ఐజి రమేష్ రెడ్డి, అడిషనల్ సీపీ లు విక్రమ్ సింగ్ మాన్, సుధీర్ బాబు హాజరయ్యారు.

# దళితులకు ఇచ్చిన భూములు లాక్కోవడం అన్యాయం

### -ఎక్లాస్ పూర్ దళితుల ఆవేదన



**మంథని - ప్రభాత సూర్యుడు**

ఎక్లాస్ పూర్ గ్రామంలో ఎస్సీ మాల దళితులకు ఇచ్చిన భూములను అధికారులు లాక్కోవడం అన్యామని పేర్కొంటూ గురువారం మంథని మండలం ఎగ్లాస్ పూర్ దళితుల భూముల మొకపై మాల కులానికి చెందిన దళితులు నిరసన వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎక్లాస్పూర్ గ్రామంలో సర్వేనెంబర్ 37/1,2,3, నెంబర్లలో 1987లో దళితులకు ప్రభుత్వం రెండు గుంటలు చొప్పున నివాస స్థలాల కోసం భూమి కేటాయించింది. దళితుల ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వారు గృహాలను నిర్మించుకోలేదు. సుమారుగా 40 ఏళ్లుగా దళితుల స్వాధీనంలోనే ఈ భూమి ఉంది.ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఈ భూములు బీడులుగా ఉంటున్నాయని చదును చేస్తూ స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తూ ట్రాక్టర్లతో చదును చేయిస్తుంది.ఇది గమనించిన దళిత కుటుంబాలు మూకుమ్మడిగా రెవెన్యూ అధికారినితో వాగ్వాదానికి దిగారు. 1987లో దళితులకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని,ఆ పత్రాలను అధికారులకు చూపించారు.ఈ భూమిని ప్రభుత్వనీ స్వాధీనం చేసుకుని ఓపెన్ హౌస్ ప్లాట్లను పెడతామని అధికారులు చెప్తున్నారు. ఇది తమ సర్వేనెంబర్ అంటూ దళితులు పత్రాలు చూపించి ఆందోళనకు దిగారు. భూములు లాక్కుంటే ఆత్మహత్య శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రెవెన్యూ ఆర్ ఐ వెనుతిరిగి వెళ్లిపోయారు. గ్రామ స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికార పార్టీ నాయకుల చోరవతోనే ఇదంతా జరుగుతుందని, ప్రభుత్వం మాకు కేటాయించిన భూములను మాకు ఇవ్వాలని,లేని ఎడల ఆందోళన చేపడతామని దళితులు హెచ్చరించారు.

## గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే దానం పూజలు

**హైదరాబాద్ -ప్రభాత సూర్యుడు :** తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఊరూరా చెరువుల పండుగ సందర్భంగా ఈరోజు హుస్సేన్ సాగర్ పీవీ నరసింహారావు స్టాచు పక్కన ఉన్నటువంటి గంగమ్మ గుడికి ఖైరతాబాద్ శాసనసభ్యులు ఎమ్మెల్యే దానం నాగేందర్, గంగమ్మకు పూజ చేసారు. అదేవిధంగా దేవాలయాన్ని అభివృద్ధి పరచాలని. గంగతెప్పను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ గంగపుత్ర సంఘం, నగర గంగపుత్ర సంఘం, తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో గడప శ్రీహరి చాట్ల సదానంద్, ఎం మహేందర్ బాబు, అంబటి సుధాకర్, మధునాల బాబురావు, పూస నరసింహ, మంగలి పెల్లి రాజు, చంద్ర ప్రకాష్, పిల్లి శంకర్, మల్కు అరుణ్ జ్యోతి , మదునాల చంద్రకళ, ఎం.సబిత, తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ముసుగు దొంగల హల్ చల్

**నిజామాబాద్ -ప్రభాత సూర్యుడు :** నిజామాబాద్ నగరంలో ముసుగు దొంగలు హల్ చల్ చేసారు. అర్ధరాత్రి ముసుగులు ధరించి షో రూమ్ లోకి ప్రవేశించారు. లక్ష రూపాయల నగదు అపహరించారు. సెక్యూరిటీ గార్డు ఉండగానే దుండగులు వెనక నుంచి చొరబడ్డారు. మహారాష్ట్ర కు చెందిన ముఠా గా పోలీసులు అనుమానిస్తున్నారు. సిసి పుటేజ్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నకిలీ విత్తనాల ముఠా గుట్టు రట్టు

**వరంగల్ -ప్రభాత సూర్యుడు :** నకిలీ విత్తనాల తయారీదారులను ముఠా సభ్యులను వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుండి సుమారు రెండు కోట్ల 11 లక్షలు విలువ గల నకిలీ విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ విత్తనాలతో పాటు ఒక డీసీఎం ఒక కారులతో పాటు విత్తనాల తయారీ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. 15మందిని అరెస్ట్ చేసిన పోలీసులు 21లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నకిలీ విత్తనాల తయారు చేస్తున్న ముఠాలో మరొ ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీస్ కమిషనర్ రంగనాథ్ తెలిపారు. రైతులను మోసం చేసిన నకిలీ ఎరువులు విత్తనాలు అమ్మకం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో దాడులు చేశామని.. నిందితుల పై పీడీ యాక్ట్ పెడుతున్నామని తెలిపారు.

## మంత్రి ప్రశాంత్ రెడ్డి పర్యటనలో అపశృతి

**నిజామాబాద్ -ప్రభాత సూర్యుడు**

:గురువారం నాడు జరుగుతున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి పర్యటనలో అపశృతి దొర్లింది. భీంగల్ మండలం పురానీపేట్ లో ఊరూరా చెరువుల పండగ లో పెను ప్రమాదం తప్పింది. మంత్రి ప్రశాంత్ రెడ్డి కి స్వాగతం పలుకుతూ కార్యకర్తలు బాణా సంచా కాల్చారు. ప్రమాదవశాత్తూ టెంట్ కు మంటలను అంటుకుని వ్యాపించాయి. ఎవరికీ ఏమీా కాలేదు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215